

కూలీ పనికి వెళ్లివస్తూ..
కూలీ పనికి వెళ్లివస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. అందులో ఒకరు మృతి చెందారు. - 8లో▸



సంస్కృతీసంప్రదాయాలతో బోధన ఉండాలి - 8లో▸
దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ మన సంస్కృతీసంప్రదాయాలు బోధించకపోవడం బాధాకరమని త్రిదండి చిన్నజీయర్‌స్వామి అన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/16^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కమ్ముకుని ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



పాలకుర్తి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ సుధీర్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డీఎంహెచ్‌ఓ సుధీర్, పీఆర్‌సీ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోగుల వివరాలు సేకరించాలన్నారు. ఆ వివరాలకు అనుగుణంగా మందులు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, డీడీవో సిద్దార్థ, వైద్యులు ఉషారాణి, అనిల్, ఇంద్రాని, సూపర్ వైజర్లు వైజర్స్ ఏఎన్‌ఎంలు చంద్రకళ, శోభారాణి, జయరామ్, కార్తీక్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన తప్పనిసరి



స్టేషన్‌ఘన్‌పూర్: యువత ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ డీజీఎం డి.శ్రీకుమార్ అన్నారు. ఘన్‌పూర్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఐ అఫీషియల్స్‌చే ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్‌నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకుమార్ హాజరై మాట్లాడారు. ఏటీఎంలు, డెబిట్ కార్డుల వినియోగం, ఇంటర్‌నెట్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ లైట్, డిజిటల్ అరెస్టు, డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, హర్షవర్ధన్, కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు నీల రాకేష్, చందర్, భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'



లింగాలఘణపురం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని టీఎస్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, జాక్ చైర్మన్ ఖాజా షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలో లింగాలఘణపురం తాలుకా యూనిట్ అత్యవసర సమావేశం మహేందర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతం, భవన నిర్మాణంతో పాటు కలెక్టరేట్‌లో జిమ్ ఏర్పాటుపై వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ సమావేశంలో టీఎస్‌జీవోస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, జిల్లా ప్రచార కార్యదర్శి నాగార్జున, తాలుకా కార్యదర్శి శంకర్, శ్రీకాంత్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం

జనగామ రూరల్: దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఆలింకో హైదరాబాద్ వారి సహకారంతో సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం ఫిబ్రవరి 4నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న స్టేషన్ ఘన్‌పూర్ లోని రైతు వేదికలో స్టేషన్ ఘనపూర్, జఫర్‌గఢ్, చిల్పూర్, రఘునాథ్‌పల్లి మండలాల నుంచి వచ్చే వారి ఎంపిక ఉంటుంది. 5న పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామ రైతువేదికలో పాలకుర్తి, దేవరుప్పుల, కొండకండ్ల మండలాలు, 6వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జనగామ రూరల్, జనగామ మున్సిపాలిటీ, లింగాలఘనపూర్, తరిగొప్పుల, నర్మెట్ట, బచ్చన్నపేట మండలాలకు చెందిన అర్హులైన దివ్యాంగులు హాజరు కావాలని కోరారు. హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్హులను గుర్తించి ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

వినతులు విన్నవించాం..

పరిష్కరించండి

ప్రజావాణికి 42 మంది దరఖాస్తులు
- స్వీకరించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పక్కన అదనపు కలెక్టర్లు

జనగామ: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 42మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. వినతులు విన్నవించాం తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులను బాధితులు వేడుకున్నారు. గ్రీవెన్స్ సెల్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ఈ గ్రీవెన్స్ సెల్‌లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఏఓ రామారావు నాయక్, సీపీఓ పాపయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితుల వినతులు ఇలా..

పాలకుర్తి రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమికి నష్టపరిహారం ఇప్పించాలని దుబ్బతండా గ్రామానికి చెందిన బానోత్ బుజ్జి వేడుకున్నారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన సబ్బని పాండు 11గుంటల భూమికి సంబంధించి పట్టా మార్పిడి చేయాలని విన్నవించారు. లింగాలఘనపురం మండలం జీడికల్ గ్రామానికి చెందిన కెంగర్ల అజయ్ ఎంసీహెచ్ ల్యాబ్ అటెండెంట్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రొవిజినల్ మెరిట జాబితాలో 3 నంబర్‌లో ఎంపికయ్యాని.. కానీ తుది జాబితాలో పేరు రాలేదని తనకు న్యాయం చేయాలని కోరారు. కరెంటు బిల్లు జీరో రావడం లేదని.. అర్హత ఉన్నా అన్యాయం జరుగుతుందని రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామానికి చెందిన పి.సోమిరెడ్డి దరఖాస్తు చేశారు. ఇలా పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధితులు కలెక్టర్‌కు వినతులు అందజేశారు.

భూమి హద్దులు చూపించండి..



భర్త వీరస్వామి సబ్ రిజిస్టర్‌గా పనిచేసి 2005లో రిటైర్మెంట్ అయ్యారు. 2011లో రెండు సర్వే నంబర్ల పరిధిలో 8.8 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. భూమి కొనుగోలు చేసిన తర్వాత స్టేట్స్‌కు వెళ్లే సమయంలో కౌలుకు ఇవ్వడంతో పాటు బ్యాంకులో రుణం కూడా తీసుకున్నాం. ధరణిలో తమ పేర్లు వస్తున్నాయి. కానీ పొజిషియన్‌లో లేమంటున్నారు. రెండు ఎకరాలకు సంబంధించి ఓ సర్వే నంబర్ పూర్తిగా కనిపించడం లేదు. 6ఎకరాలకు సంబంధించిన వివరాలు క్లారిటీగా లేవు.

- బైరి అనిత, గీతానగర్, జనగామ

పింఛన్ ఇప్పించి ఆదుకోండి..



పుట్టుకతోనే మనువడు జహంగీర్ అంగవైకల్యంతో జన్మించాడు. మెడ నిటారుగా ఉండదు. మానసికంగా ఎదగడం లేదు. బాబు తల్లిదండ్రులు నూరుద్దీన్ భాషా, షబానా తమకు అప్పగించి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. రోజువారీగా కూలీపని చేసుకుంటేనే పూట గడిచేది. బాబుకు సదరం సర్టిఫికెట్ వచ్చినా పింఛన్ మంజూరు కావడం లేదు. ప్రతినెలా బాబు వైద్య ఖర్చుల కోసం రూ.4వేలకు పైగానే ఖర్చు చేస్తున్నాం.

- ఎండి గౌస్‌మియా-భాను దంపతులు, కంచెనపల్లి, రఘునాథపల్లి

రేషన్‌కార్డులో మండలం పేరు తప్పు పడింది..



ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ పొందాను. ఆరేళ్ల క్రితం రేషన్ కార్డు వచ్చింది. అందులో స్టేషన్‌ఘన్‌పూర్ మండలంకు బదులుగా చిల్పూరు అని పడింది. మండలం పేరు మార్చాలని తహసీల్దార్, ఇతర ఆఫీసర్ల వద్దకు నిత్యం తిరుగుతున్నాను. తన పిల్లలకు చదువు నిమిత్తం సర్టిఫికెట్ల జారీ విషయంలో మండలం పేరు తప్పు ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- కందుకూరి కొమురయ్య, స్టేషన్‌ఘన్‌పూర్

ఇళ్ల జాబితాలో పేరు కనిపించడం లేదు..



మల్లంపల్లిలో సొంత ఇల్లు లేకపోవడంతో అద్దెకు ఉంటున్నాను. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. గ్రామ సమస్యలపై స్థానిక అధికారులను ప్రశ్నిస్తే జాబితాలో తన పేరు కనిపించడం లేదు. కలెక్టర్ స్పందించి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి.

- దిండిగాల వెంకన్న, మల్లంపల్లి, పాలకుర్తి


చాలీచాలని వేతనాలు



జనగామ మున్సిపాలిటీలో 180 మంది శానిటేషన్ కార్మికులు పని చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో సొంత ఇళ్లు లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇందిరమ్మ ఇళ్ల మొదటి జాబితాలో తమకు ప్రియార్టీ ఇవ్వాలి. ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

- శానిటేషన్ కార్మికులు, జనగామ

ఒకే ఇంటిపై నాలుగు ఇళ్లు మంజూరు



జనగామ పట్టణంలోని 26వ వార్డు గణేశ్ స్ట్రీట్ హౌజ్ నంబర్ 3-6-14లో (సొంత ఇల్లు) నివాసం ఉంటున్నాము. ప్రజాపాలన వార్డుసభల్లో తన ఇంటి నంబర్‌పై బై నంబర్లు వేసి నాలుగు ఇళ్లు మంజూరు అయినట్లు ఎలిజిబులిటీ జాబితాలో చూపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- పొన్నాల జగత్ కుమార్, గణేశ్ స్ట్రీట్, జనగామ

విద్యుత్ తీగల పక్కనే పిల్లలతో పని



రఘునాథపల్లి ప్రాథమిక పాఠశాల పక్కనే విద్యుత్ తీగలు ఉన్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పిల్లలను భవనం పైకి ఎక్కించి పనులు చేయించారు. విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది. దీనిపై కలెక్టర్ విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- గణేశ్ ఠాకూర్, రఘునాథపల్లి

మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ బాధ్యతలు



అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

జనగామ: జనగామ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఏసీ) పింకేష్ కుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అదనపు బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పింకేష్‌కుమార్ బాధ్యతలను స్వీకరించగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పింకేష్ కుమార్ కమిషనర్‌తో పాటు అధికారులు, ఉద్యోగులతో పట్టణం అభివృద్ధి, ఇతర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఏఈ మహిపాల్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న శివరాజ్ యాదవ్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. సోమవారం ఏఎంసీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సహకారంతో మార్కెట్‌కు పూర్వ వైభవం రాబోతుందని తెలిపారు. గత పాలకవర్గం సమావేశంలో చేసిన తీర్మాణాలు త్వరతగతిన అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లింగాలఘనపూర్ సబ్ మార్కెట్ యార్డులో కవర్ షెడ్ నిర్మాణం, రోడ్డు పనులు, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు వివరించారు. సమావేశంలో మార్కెట్ ప్రత్యేక శ్రేణి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అర్జీలకు ప్రత్యేక కౌంటర్లు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పక్కన అదనపు కలెక్టర్లు

జనగామ: ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించేందుకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి పరిశీలన, డాటా ఎంట్రీ, గ్రామ, వార్డు సభల నిర్వహణలో అధికారుల పనితీరు బాగుందన్నారు. నాలుగు పథకాల దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి వచ్చేవారం నుంచి ప్రతీ మండలంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. రేషన కార్డుల కోసం పౌర సరఫరాల శాఖ, ఇందిరమ్మ ఇళ్ల ధ్రువీకరణకు గృహ నిర్మాణశాఖ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఫిర్యాదులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, రైతు భరోసా, రైతు రుణమాఫీ సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పింఛన్ల సమస్యలపై ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలని ఆదేశించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి..

గురుకులాల్లో ప్రవేశాలకు 60వేల సీట్ల భర్తీకి వచ్చే నెల 23న ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు సంబంధించి పంచాయతీ కార్యద ర్శులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేయించాలన్నారు. 12 మండల కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలను సత్వరమే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఆర్డీఓలను ఆదేశించారు.

పెట్టుబడి సాయం వచ్చేసింది..

- 5,947 రైతుల ఖాతాల్లో రూ.20కోట్ల మేర డిపాజిట్



జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా (వ్యవసాయానికి పెట్టుబడి సాయం) సోమవారం విడుదల చేసింది. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాల అమలును జిల్లాలోని 12 మండలాల్లో 12 గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలోని 12 గ్రామాల్లో రైతు భరోసా కింద 5,947 మంది రైతులను ఎంపిక చేశారు. ఈ మేరకు ఇప్పటి వరకు రూ.20కోట్ల మేర వారి వారి బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమచేశారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా త్వరలోనే అర్హులైన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమకానుంది. ఇందుకు సంబంధించి రైతుల ఫోన్లకు మెసేజ్ సైతం అధికారులు పంపించారు. ఇందిరమ్మ ఇళ్లు 887, రేషన్ కార్డులు 1,102, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 260 మందికి ప్రారంభం రోజునే ధృవపత్రాలను అందించారు. ఇదిలా ఉండగా రేషన్ కార్డుల్లో మెంబర్ అడిషన్(చేరికలు) ప్రక్రియ సైతం ప్రారంభమైంది.

ఆయుర్వేదిక్ డ్రగ్స్ కంపెనీపై క్రిమినల్ కేసు



డ్రగ్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

జనగామ: జనగామ పట్టణంలోని అభ్యంతరకర ప్రకటనలతో మందుల అమ్మకాలు చేస్తున్న గుజరాత్‌కు చెందిన ధన్వంతరి ఆయుర్వేదిక్ డ్రగ్స్ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వరంగల్ ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. జనగామ ఔషధ తనిఖీ అధికారి ఏలె బాలకృష్ణతో కలిసి ఆమె సోమవారం ఆకస్మిక దాడులు చేపట్టారు. నిబంధనలు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్న మందులను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి కోర్టుకు పంపించినట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్మడం ప్రజల ఆరోగ్యానికి హానికరం కావడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కల సాకారం..

- మున్సిపాలిటీగా స్టేషన్‌ఘన్‌పూర్
- స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలతో ఏర్పాటు
- నేటినుంచే అధికారికంగా అమలులోకి..
- ఫలించిన ఎమ్మెల్యే కడియం కృషి
- గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి అదనపు బాధ్యతలు



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ వ్యూ(ఇన్‌సెట్‌లో) ఘన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నో ఏళ్ల తరబడి నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు ఎదురుచూస్తున్న ఘన్‌పూర్ మున్సిపాలిటీ కల ఎట్టకేలకు నెరవేరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ఆమోదంతో సోమవారం గెజిట్ విడుదల చేయగా నేటి నుంచే అధికారికంగా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా అవతరించింది. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలకు కలుపుకుని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. జిల్లాలో జనగామ తర్వాత పెద్ద సెంటర్ స్టేషన్‌ఘన్‌పూర్. మున్సిపాలిటీ అయ్యే అవకాశం ఉన్నా ఎన్నో ఏళ్లుగా మోక్షం లభించలేదు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఏర్పాటు విషయంలో మొదటి నుంచి పాలకులు, ప్రజాప్రతినిధులు శీతకన్ను వేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మేజర్ గ్రామ పంచాయతీ అయిన స్టేషన్‌ఘన్‌పూర్ జనాభా 12వేల పైచిలుకు ఉంది. ఘన్‌పూర్‌కు జంట పట్టణమైన శివునిపల్లి జనాభా 6వేలకు పైగా ఉంది. మున్సిపాలిటీ కావాలంటే నిబంధనల మేరకు 15వేల జనాభా ఉండాలి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఘన్‌పూర్ మున్సిపాలిటీ అవుతుందని విస్తృత ప్రచారం సాగింది. అయితే ఘన్‌పూర్‌పై పాలకుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో మున్సిపాలిటీ ఆశ నిరాశగానే మిగిలింది. ఘన్‌పూర్ కన్నా చిన్నదైన 2011 లెక్కల ప్రకారం కేవలం 8వేల పైచిలుకు జనాభా ఉన్న వర్ధన్నపేటను మున్సిపాలిటీగా చేశారు. దాంతో ఘన్‌పూర్ గ్రామ పంచాయతీగానే మిగిలిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు స్టేషన్‌ఘన్‌పూర్ జనాభా దాదాపు 16వేలకు పైగా ఉన్నప్పటికీ స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీ అవుతుందని ప్రచారం సాగినా ప్రజల కోరిక మాత్రం నెరవేరలేదు.

కమిషనర్‌గా కృష్ణారెడ్డి



ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డికి స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్యే కడియం కృషితోనే..

అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీలకు అనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేసేందుకు ఎంతో కృషి చేశారు. ఈ విషయమై సంబంధిత మంత్రి, జిల్లా మంత్రులు, సీఎంను కలిసి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని కోరారు. అందుకు అనుగుణంగా గత నెల 20వ తేదీన అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ఘన్‌పూర్ మున్సిపాలిటీపై ప్రకటన చేశారు. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాజపత్రం ద్వారా గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీని ఏర్పాటు చేసి ప్రజల కోరిక నెరవేర్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను కలిపి మున్సిపాలిటీ చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లాను. తద్వారా అధిక నిధులతో సమగ్రాభివృద్ధి జరుగుతుందని వివరించాను. ఈ మేరకు మున్సిపాలిటీగా ప్రకటించిన సీఎంకు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, జిల్లా మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా మున్సిపాలిటీని ఘనంగా ప్రారంభిస్తాం.

- కడియం శ్రీహరి, ఎమ్మెల్యే

మెరిట్ జాబితా విడుదల

జనగామ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసేందుకు 9ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ మల్లిఖార్జున్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్ 11న కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. అదే నెల 19వరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం, మెరిట్, ఎంపికైన వారి జాబితా సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు జిల్లా కార్యాలయంలో నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 30న మధ్యాహ్నం 2.30 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో తమ కార్యాలయానికి రావాలని సూచించారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి..

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: పేదలకు అభ్యున్నతికి అహర్నిశలు పోరాడిన మహనీయుడని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సేవలు మరువలేనివని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో విగ్రహదాత అందె యాకయ్య ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రాజారాంమోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే బడుగు, బలహీన, దళిత, గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు రిజర్వేషన్ ఫలాలు దక్కాయన్నారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కొడకండ్లలో 40ఏళ్లుగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనే కల యాకయ్య కృషితో సాకారమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్(ఫైల్)

భూపాలపల్లి అర్బన్ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి శివారు బాలాజీనగర్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడి తల్లి కందుల సుగుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుగుణ కొడుకు కందుల సురేశ్ (37) కాశీంపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీలు చూడడానికి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకుని ఇంటి ముందు పడుకున్నాడు. తెల్లవారుజామున 5 గంటలకు చూసేసరికి మృతి చెందినట్లు తెలిపారు. ఎవరో రాత్రి సమయంలో హత్య చేసి ఎవరికి అనుమానం రాకుండా మంచంమీద పడుకోబెట్టి వెళ్లారని విలపిస్తూ తెలిపింది. పథకం ప్రకారమే ఇద్దరు వ్యక్తులు కలిసి తన కొడుకును హత్య చేసి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి నడుం భాగంలో గాయాలు కనిపించడంతో పక్కాగా ఇద్దరు కలిసి హత్య చేసి ఉంటారని తల్లి అనుమానాన్ని వ్యక్తం చేసింది. మృతుడు లారీడ్రైవర్ కాగా అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ కుమార్ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



కేసముద్రం: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని అన్నారంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన యాకూబ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి కూలీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంటితాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోకి ఉన్న అర తులం బంగారు, వెండి ఆభరణాలు, రూ.6వేల నగదు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజును వివరణ కోరగా చోరీ ఘటన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరపనున్నట్లు ఆయన తెలిపారు.

కూలీ పనికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదానికి గురై

గూడూరు-అంబాల మధ్య ఆర్టీసీ బస్సు, టాటా ట్రాలీ ఢీ..
- 13 మందికి తీవ్ర గాయాలు
- ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి
- డ్రైవర్ పరిస్థితి విషమం



బస్సును ఢీకొని బోల్తా పడిన ట్రాలీ, ఘటనాస్థలిలో క్షతగాత్రులు

కమలాపూర్/హసన్‌పర్తి: ఆ బస్తీలో సుమారు 40 ఇళ్లు ఉన్నాయి. వీరందరూ నిరుపేదలు. బండకొట్టడం వీరి ప్రధాన వృత్తి. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటారు. ప్రస్తుతం స్థానికంగా ఉపాధి లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం కూడా మరో ప్రాంతానికి వెళ్లారు. పనులు ముగిసిన అనంతరం టాటా ట్రాలీలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ట్రాలీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లికి చెందిన సుమారు 24 మంది కూలీలు కమలాపూర్ మండలం వంగపల్లికి వ్యవసాయ పనికి వచ్చారు. పని ముగించుకుని మధ్యాహ్నం టాటా ట్రాలీలో మునిపల్లి వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాలీ గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న 13 మంది కూలీలు తీవ్రంగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు.


హుస్సేన్‌బీ (ఫైల్)

సమాచారం అందుకున్న కమలాపూర్ సీఐ హరికృష్ణ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులందరినీ 108 వాహనాల ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళా కూలీ హుస్సేన్ బీ (45) మృతి చెందగా, ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన వారిలో సమీనాబీ, యాకూబ్‌పాషా, స్వల్పంగా గాయపడిన వారిలో కరీమా, ముంతాజ్ బేగం, యాకూబ్‌బీ, ఆశ, రంజాన్, గౌసియా, హుస్సేన్ బీ, కరీంబీ ఉన్నారు. కాగా, సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ బొట్ల మహేందర్ ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఎంజీఎంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎ.శ్రీనివాస్, స్వరూప ఉన్నారు.



నెరవేరనున్న 40 ఏళ్ల కల..!

- కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అడుగులు
- నేడు కలెక్టర్, ఆర్డీఓ, రైల్వే అధికారుల బృందం జాయింట్ ఇన్‌స్పెక్షన్ విజిట్


రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

కాజీపేట రూరల్ : పట్టణ ప్రజల చిరకాల కోరిక కాజీపేట బస్టాండ్ కల త్వరలో నెరవేరబోతుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృషి, పట్టుదలతో 40 ఏళ్ల బస్టాండ్ సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కాజీపేట బస్టాండ్, కాజీపేట రైల్వే డివిజన్, బోడగుట్ట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, కాజీపేట స్టేషన్ సమీపాన రోడ్డు అండర్‌బ్రిడ్జి, ఇతర దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్ కోట్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్ కోసం ఎకరం భూమిని లీజ్ లేదా, రైల్వే భూమి ఇస్తే ప్రభుత్వ భూమి ఇవ్వడం, లేదంటే ప్రభుత్వ ధర ప్రకారం భూమి ఇవ్వాలని జీఎంను కోరామన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులు, రైల్వే అధికారుల బృందం కాజీపేట జంక్షన్‌లో రైల్వే సంఘ్ కార్యాలయం సమీపం నుంచి బ్రిడ్జి వైపు రైల్వే క్వార్టర్స్ స్థలాన్ని జాయింట్ ఇన్‌స్పెక్షన్ విజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్‌లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాజీపేట బస్టాండ్ ల్యాండ్ ఫైనల్ కావడంతో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి ప్రారంభం, కాజీపేట బస్టాండ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిపిస్తామన్నారు. అలాగే, కాజీపేట చిరకాల వాంఛ కాజీపేట డిగ్రీ కాలేజీ, కాజీపేట ప్రభుత్వ ఆసుపత్రి మంజూరును ముఖ్యమంత్రితో అనౌన్స్‌మెంట్ చేయించాలన్నదే తన కల అని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు.

42 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది


హలో ముదిరాజ్..చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఏడాదైనా హామీపై ఇప్పటికీ స్పష్టత లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా బీసీ కమిషన్ వేశారని దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశానుసారం, బీసీల డిమాండ్‌తో డెడికేటెడ్ కమిషన్ వేశారన్నారు. అయినా ఇప్పటి వరకు రిజర్వేషన్లపై స్పష్టత లేదని విమర్శించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ, అధికారంలో ఉన్న పార్టీయే కారణమన్నారు. బీసీలకు రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. ఈసారైనా బీసీ కులగణన చేయాలన్నారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. హనుమకొండలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హలో ముదిరాజ్.. చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల శ్రీలత, నాయకులు చొప్పరి సోమయ్య, నీల రాజు, రాజకుమార్, దువ్వ నవీన్, పులి విక్రమ్, దువ్వ కనకరాజ్, పిట్టల సత్యనారాయణ, మహేందర్, బండి సతీశ్, ఉమాదేవి, అనురాధ, కిరణ్, రవి కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టి ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు
- ఘటన ప్రదేశంలోనే మరో ఘటన


హైవేపై బోల్తా పడిన ఆటో

ఖిలా వరంగల్ : వరంగల్-ఖమ్మం హైవే మామునూరు టీజీఎస్పీ పెట్రోల్‌బంక్ స్పీడ్ బ్రేకర్ వద్ద లారీ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం అర్ధరాత్రి అదే ప్రదేశంలో మరో రోడ్డు ప్రమాదం సంభవించింది. వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు వెళ్తున్న ఆటో ఆకస్మాత్తుగా అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఎదురుగా వచ్చే కారును ఢీకొని రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా ఓ ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు ప్రయాణికుడిని ఆటోలో ఎక్కించుకొని బయలుదేరాడు. ఈ క్రమంలో నలుగురు మృతిచెందిన ఘటనాస్థలికి రాగానే ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి లారీ, కారును ఢీకొడుతూ బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌తో పాట ప్రయాణికుడిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రోడ్డుపై అడ్డుగా బోల్తా పడిన ఆటోను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..

- వ్యక్తి మృతి
- కోతులనడుమ బ్రిడ్జిపై ఘటన


రాజేశ్వర్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఎల్కతుర్తి మండలం కోతులనడుమ బ్రిడ్జిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బచ్చు రాజేశ్వర్‌రావు(52) ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని కోతులనడుమ బ్రిడ్జిపై ఎల్కతుర్తి నుంచి హుజూరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో రాజేశ్వర్‌రావుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్

- ఇప్పటికే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఖరారు
- 29న నోడల్ ఆఫీసర్ల సమీక్ష



హన్మకొండ: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలు, అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 29న అన్ని సర్కిళ్లలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లకు నోడల్ అధికారులుగా సీజీఎంలను నియమించారు. హనుమకొండ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) టి.మధుసూదన్, వరంగల్ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ రాజు చౌహాన్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరు బుధవారం ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులతో సర్కిల్ కార్యాలయాల్లో సమీక్ష నిర్వహిస్తారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేపట్టిన పనులు, పూర్తయినవి, పురోగతిలో ఉన్న వాటిపై సమీక్షించి మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

సమ్మక్క జాతరకు ఆహ్వానం


పీఓకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పూజారులు, ఆదివాసీ సంఘాలు

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో నిర్వహించే సమ్మక్క- సారలమ్మ జాతరకు ఏటూరు నాగారం ఐటీడీఓ పీఓ చిత్ర మిశ్రాకు పూజారులు, ఆదివాసీ నాయకులు సంయుక్తంగా ఆహ్వానపత్రం అందజేశారు. పీఓను కలిసిన వారిలో పూజారుల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి, పీరీల భాస్కర్, పులిష బాలు, తిరుపతి, సురేశ్, పోడెం బాబు, ఆలం రాంబాబు తదితరులు ఉన్నారు.

సంస్కృతీసంప్రదాయాలతో బోధన ఉండాలి


- త్రిదండి చినజీయర్ స్వామి


అతిథులకు సత్కారం చేస్తున్న జీయర్ స్వామి

జనగామ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ మన సంస్కృతీసంప్రదాయాలు బోధించే విద్యా విధానం లేకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ఆ లోటును భర్తీ చేసి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలని త్రిదండి చినజీయర్‌స్వామి కోరారు. పట్టణంలోని బాణాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు, యాదాద్రి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి తండ్రి గోవిందాచార్య, గురువు త్రిపురారి రామకృష్ణ సిద్ధాంతి స్మృత్యర్థం నిర్వహించిన ఆచార్య వరివస్య కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా జీయర్‌స్వామి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగంలో కృష్ణమాచారి సిద్ధాంతి చేస్తున్న సేవలను అభినందించారు. పెద్దలను స్మరించడంతో పాటు సహచరులను సత్కరించి వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం శ్రీ వరహస్వామికి స్వర్ణ కిరీటధారణ చేసి, కాలవివేకం అనే పుస్తకాన్ని జీయర్‌స్వామి ఆవిష్కరించారు. కృష్ణమాచార్య సిద్ధాంతి మాట్లాడుతూ జీయర్‌స్వామి చేతుల మీదుగా వరాహస్వామికి స్వర్ణకిరీటం సమర్పణ చేయడం సంతోషకరమన్నారు. సోమవారం జీయర్‌స్వామికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆచార్యులు ఆకెళ్ల జయకృష్ణ, శ్రీనివాసాదిత్య, ఫణివరకుమార్, బట్టర్ సుందర ప్రహ్లాదచారి, తిరువెంగలాచారి, నరసింహరామ, గౌరీబట్ల సీతారామ సిద్ధాంతి, బ్రహ్మబట్ల శ్రీనాథ్, శ్రీనివాసాచార్య, గౌరిబట్ల సుబ్రహ్మణ్య శర్మ, ఓరుగంటి మనోహరాశర్మ, యోగేశ్వర, అమర వాది లక్ష్మణాచార్యులు, మరింగంటి రాఘవాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలి

- కాంట్రాక్టు అధ్యాపక కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న రాజేశ్ తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాకే రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు డాక్టర్ సాధురాజేశ్, డాక్టర్ బి. సతీశ్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశం(గేట్‌మీటింగ్) వారు మాట్లాడారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఖాళీ అధ్యాపకుల పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నవారికి న్యాయం చేయాలన్నారు. అందుకు అన్ని విద్యార్హతలు కలిగి ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు డాక్టర్ సత్యజూల, డాక్టర్ సీహెచ్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ రఘువర్ధన్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సూర్యనారాయణ,డాక్టర్ సతీశ్, డాక్టర్ బి. వెంకటగోపినాథ్, రంజిత్, తూర్పాటి వెంకటేశ్, డాక్టర్ వీణ, వాణిశ్రీ, దీప్తి, స్వప్న, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- తొడేళ్లగూడెంలో ఘటన
- తన మృతికి ముగ్గురు కారణమంటూ సెల్ఫీ వీడియో


సతీశ్(ఫైల్)

డోర్నకల్: ఓవ్యక్తితో గొడవల తోపాటు పోలీసు కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన డోర్నకల్ మండలం తొడేళ్లగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పగడాల సతీశ్(30) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామస్తుడు సుంకరి వెంకన్న, సతీశ్ మధ్య గొడవల జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకన్న కౌలుకు తీసుకున్న భూమి నుంచి ఈ నెల 21 సతీశ్ వెన్నారం వాగు నుంచి ఇసుక తరలించాడు. దీంతో వెంకన్న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. మరుసటి రోజు సతీశ్ తన ఇంటి సమీపంలో వెంకన్న ఇంటికి వెళ్లే రోడ్డుపై కంప అడ్డుగా పెట్టాడు. దీనిపై వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు సతీశ్‌పై ఈ నెల 24న కేసు నమోదు చేశారు. దీంతో వెంకన్నతో గొడవలు, పోలీస్ కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన సతీశ్ ఆదివారం ముల్కలపల్లిలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న వారు చూసి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా సతీశ్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు.

నా చావుకు ఆ ముగ్గురే కారణం..

తన చావుకు సుంకరి వెంకన్న, ఆయన కుమారులు చరణ్, పవన్ కారణమని పురుగుల మందు తాగడానికి ముందు సతీశ్ సెల్ఫీ వీడియో ద్వారా తెలిపాడు. ఇసుక రవాణాతో పాటు ఇతర కారణాలతో తనను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తన చావుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు సీఐ రాజేశ్ సోమవారం విచారణ చేపట్టారు.

హత్యాయత్నం.. రోడ్డు ప్రమాదంగా

కేసు నీరుగార్చేందుకు కుట్ర..
- ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్వాకం
- నిందితులతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

హన్మకొండ చౌరస్తా: శత్రువుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి వైద్యులు చికిత్స అందిస్తే.. రికార్డుల్లో మాత్రం రోడ్డు ప్రమాదంగా నమోదు చేసి కేసును నీరుగార్చే కుట్రకు పూనుకుంది ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం. తనకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానంలో పోరాడుతున్న సదరు యువకుడు ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన మెడికల్ రికార్డులను చూసి ఆందోళనకు గురయ్యాడు. యాజమాన్యాన్ని ప్రశ్నించగా బెదిరింపులే దిక్కయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా వంగపహాడ్‌కు చెందిన శ్యాంరావు ప్రశాంత్‌కుమార్ 2022, జనవరి 20వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి వద్ద ఉండగా కొందరు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి(ఇటీవల పేరు మార్చారు) తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అత్యవసర చికిత్స అందించారు. తలపై 22కు పైగా కుట్లు వేయడంతో పాటు చేతి వేలు విరిగిపోగా సర్జరీ చేసి రాడ్డు వేశారు. మూడు రోజుల చికిత్స అనంతరం 24వ తేదీన ప్రశాంత్‌కుమార్‌ను డిశ్చార్జ్ చేశారు. మెరుగైన వైద్య కోసం అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొద్ది రోజులు చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నాడు.

ఆస్పత్రి మాయాజాలం


బాధితుడు శ్యాంరావు ప్రశాంత్‌కుమార్

ప్రైవేట్ ఆస్పత్రిలో న్యూరో, ఆర్థో సర్జన్‌లు శస్త్ర చికిత్స చేసి వైద్యం అందించారు. ఆ సమయంలో ప్రశాంత్‌కుమార్ తనపై పది మంది దాడి చేశారని వారి పేర్లతో సహా తెలియజేశాడు. అతడి తండ్రి రఘు ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ల తర్వాత కేసు తాజాగా తుది దశకు చేరుకుంది. ఈ సమయంలో కీలకమైన మెడికల్ రిపోర్టును చికిత్స అందించిన సదరు ఆస్పత్రి యాజమాన్యం హత్యాయత్నం కాదు రోడ్డు ప్రమాదంలో గాయపడి వచ్చిన ప్రశాంత్‌కుమార్ చికిత్స అందించినట్లు చిత్రీకరించింది. విషయం తెలుసుకున్న ప్రశాంత్‌కుమార్ తనకు జరిగిన అన్యాయంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో ముందు రాజీ కుదుర్చుకుందామన్నారు. వినకపోవడంతో బెదిరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులతో చేతులు కలిపి శిక్ష నుంచి తప్పించుకునేందుకు సహకరిస్తున్నారని ప్రశాంత్‌కుమార్ వాపోయాడు. ఈ విషయంపై డీఎంహెచ్ఓ అప్పయ్యకు ఫిర్యాదు చేశానని, నిందితులకు సహకరించిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ విషయమై ఆ ప్రైవేట్ ఆస్పత్రి చైర్మన్, ఆర్ఎంఓలను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.